నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 18 జనవరి 2024 | KAMAREDDY

## ఖాళీగా 'రూరల్ క్యాంపు ఆఫీస్'

నిజామాబాద్ రూరల్, జనవరి 17: ఎమ్మెల్యేలు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం రూ. కోటితో క్యాంపు కార్యాలయాలను నిర్మించింది. ఇందులోభాగంగా జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన రూరల్ క్యాంప్ కార్యాలయ భవనం నిర్మించగా..గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చాక ఆర్అండ్‌బీ అధికారులు తాళం వేశారు. ఎన్నికల్లో రూరల్ ఎమ్మెల్యేగా డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి ఎన్నికై 45 రోజులు గడుస్తున్నా ..ఇప్పటి వరకు క్యాంపు కార్యాలయంలో ఆయన అడుగుపెట్టకపోవడం గమనార్హం. కార్యాలయ భవనం వాస్తు సరిగ్గా లేదని ఇక్కడికి అడుగు పెట్టడానికి ఎమ్మెల్యే సుముఖత చూపడంలేదని సమాచారం. దవాఖానల్లో మెరుగైన వైద్యచికిత్స చేయించుకుని సీఎం ఆర్ఎఫ్ కోసం రూరల్ నియోజకవర్గంలో సుమారు 12వందల మంది దరఖాస్తు చేసుకోగా..వారంతా ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మరికొందరు సీఎంఆర్ఎఫ్ కోసం ఎక్కడ దరఖాస్తు ఇవ్వాలో తెలియక అయోమయంలో ఉన్నారు. క్యాంప్ కార్యాలయానికి వేసిన తాళం ఎప్పుడు తీస్తారని ఆర్అండ్‌బీ ఏఈ ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా.. తమకు ఎమ్మెల్యే నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని సమాధానమిచ్చారు


## ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచాలి


కొవిడ్ టెస్టింగ్ కిట్లను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్

భిక్కనూరు, జనవరి 17 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్నందునా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన సౌకర్యాలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి యెమిమా, ఆరోగ్య విస్తీర్ణాధికారి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

# పరిపాలనపై పట్టింపేది..?

- నెలన్నర రోజులైనా ఉమ్మడి జిల్లాలో స్తబ్ధత
- పదవులు, ఇసుక రీచ్‌లపైనే కాంగ్రెస్ నేతల దృష్టి
- ప్రజాపాలన దరఖాస్తులతోనే సరిపెట్టిన వైనం
- అభివృద్ధి అంశాలను పట్టించుకునే నాథుడే కరువు
- అధికార పార్టీ ప్రజాప్రతినిధుల్లో కనిపించని ముందుచూపు



తాళం వేసి ఉన్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

నిజామాబాద్, జనవరి 17
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సరిగ్గా నెలన్నర రోజులు అవుతున్నది. ప్రజాపాలన, అభయహస్తం దరఖాస్తుల హడావిడి తప్పితే స్థానికంగా ప్రజల అభిష్టానికి అనుగుణంగా సమీక్షలు, సమావేశాలు, భవిష్యత్తు ప్రణాళికలపై దృష్టిపెట్టే నాథుడే కరువయ్యాడు. ఎంతసేపూ రాజకీయ ప్రకటనలు తప్పితే అధికారం చేపట్టిన తర్వాత బాధ్యతగల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎవ్వరూ ప్రణాళికాబద్ధమైన పరిపాలనకు అడుగులు వేయలేదని ప్రజలంతా భావిస్తున్నారు. 11 మందితో మంత్రివర్గం కొలువుదీరిన పిదప మిగిలిన ఆరు మంత్రి పదవుల భర్తీ అలాగే ఉన్నది. ఇందులో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిథ్యం కరువైంది. పోటాపోటీగా ఎమ్మెల్యేగా గెలిచినవాళ్లు, ఎన్నికల్లో ఓటమి చెందిన వారంతా పైరవీలకే పెద్దపీట వేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇన్‌చార్జి మంత్రి హోదాలో జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చి ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియపై రివ్యూ నిర్వహించి వెళ్లారు. తదనంతరం మరోమారు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చి వెళ్లారు. ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. మంత్రి పదవులు లేకపోతే ఎమ్మెల్యే హోదాలో ప్రభుత్వ యంత్రాంగాన్ని దిశా నిర్దేశం చేయొచ్చు కదా? అంటూ ప్రజలంతా అధికార పార్టీ ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్నారు.



### సాగు, తాగునీటిపై దృష్టి ఏది?

వచ్చేది ఎండాకాలం. తీవ్రమైన తాగునీటి కొరత ఉండే అవకాశాలు ఉంటాయి. ఉభయ జిల్లాల్లో చారిత్రక ప్రాజెక్టుల్లో ప్రస్తుతానికి నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. యాసంగి సాగుకు నీటిని వినియోగిస్తే మూడు, నాలుగు నెలల తర్వాత తాగునీటి ఎద్దడి తీర్చడం పెద్ద సవాలుగా మారుతుంది. తాగు, సాగునీటి ఎద్దడి నివారణకు ఇప్పటి నుంచే అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సి ఉన్నది. కానీ అధికార పార్టీలోని ఎమ్మెల్యేలకు మాత్రం ఉభ య జిల్లాలోని రైతులు, సామాన్య ప్రజల ఇక్కట్లు ఏవీ కనిపించడం లేదు. నెలన్నర రోజులైనప్పటికీ ఎమ్మెల్యేలుగా చేపట్టాల్సిన ప్రాథమిక విధిని వారు విస్మరించారు. ఉమ్మడి జిల్లాకు ప్రాతినిథ్యం వహించేందుకు మంత్రి లేకపోయినప్పటికీ ఇన్‌చార్జి మంత్రితోనైనా ఈ కార్యకలాపాలను నిర్వహించుకోవాల్సి ఉన్నది. ముందస్తు అప్రమత్తతో నీటి పారుదల శాఖ అధికారులు, మిషన్ భగీరథ ఇంజినీర్లతో సమీక్షలు నిర్వహించాల్సి ఉన్నా ఎంతకూ ఈ వ్యవహారంపై ఎవ్వరూ దృష్టి సారించలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి ఇప్పటికే నిజాంసాగర్ ఆయకట్టు రైతుల అవసరాలపై ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సాగునీటి విడుదలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. అయినప్పటికీ ప్రభుత్వంలో కదలిక లేకుండా పోవడం శోచనీయంగా మారింది. బాన్సువాడ నియోజకవర్గంలోనైతే ఎమ్మెల్యేగా ఓడిపోయిన అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడైతే ఎంతసేపూ ఇసుక రీచ్‌ల వెంటే పర్యటనలు సాగిస్తుండడం చర్చనీయాంశం అవుతున్నది. మంజీరా పరీవాహక రైతులకు సాగునీటి అవసరాలను గుర్తించని సదరు నేత... ఎన్నికల ఫలితాల మరునాటి నుంచే ఇసుక తిన్నెలపై కన్నేసి వ్యవహారాలను నడుపుతుండడం అందరినీ ముక్కున వేలేసుకునేలా చేస్తున్నది.

### మనసంతా అటువైపే...

పదేండ్ల తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నేతలంతా పదవులపైనే ఎక్కువగా దృష్టి సారించారు. దీంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాల సరళి వెనక్కి వెళ్లినట్లు అయ్యింది. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి నిలుపుదల చేస్తున్నారు. పథకాలను ఎడాపెడా రద్దు చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పన విషయంలో మంజూరైన పనులను ముందుకు తీసుకుపోవాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ వాటిని హస్తం ప్రజాప్రతినిధులెవ్వరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు విస్తరణ, కొత్త తారు, సీసీ రోడ్డు పనులపై దృష్టి సారించడం లేదు. పెండింగ్ పనులను ప్రజల అవసరాలరీత్యా కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నప్పటికీ వాటిపై సమీక్షించిన దాఖలాలే లేకుండా పోయాయి. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే లీకుల నేపథ్యంలో జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పీసీసీ ముఖ్య నాయకుడు షబ్బీర్ అలీలు ఎవరికి వారే పదవుల కోసం పైరవీలు షురూ చేశారు. పదవుల పందెరం జోరుగా నడుస్తుండడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు స్థానిక ప్రజలకు సైతం సమయం ఇచ్చే గతి లేకుండా పోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగంలోనూ స్తబ్ధత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఉన్నతాధికారుల ఆదేశాలను కింది స్థాయికి తీసుకెళ్లడం మినహా ప్రజలకు అవసరమయ్యే అత్యవసర వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## నెలాఖరులోపు 'రైతుబంధు' పూర్తి

- రుణమాఫీ ఆర్థికంగా కష్టమే.. కానీ చేసి తీరుతాం
- ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతు డిక్లరేషన్‌ను అమలుచేస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

నందిపేట్, జనవరి 17: ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నెలాఖరులోపు రైతుబంధు ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్థికంగా కష్టమైనా రుణమాఫీ ప్రక్రియ కూడా చేపడతామన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం ఆంధ్రనగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి తుమ్మల బుధవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన తాను రైతు పక్షపాతిని అని, ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా రైతుల కోసం పని చేస్తానన్నారు. రైతుల అవసరాలు, కష్టాలు తీర్చడానికి, అన్నదాతల భవిష్యత్తు కోసం ఎంత కష్టమైనా, ఇబ్బంది అయినా రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. ఇప్పటికే రెండు ఎకరాల్లోపు భూమి ఉన్న 29 లక్షల మందికి రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడ్డాయని తెలిపారు. మిగతా వారికి సైతం ఈ నెలాఖరులో పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షల పంట రుణం ఒకేసారి మాఫీ చేయడం ప్రభుత్వానికి కష్టమే అయినప్పటికీ, ముఖ్యమంత్రి ఆలోచన, పద్ధతి ప్రకారంగా కొద్ది రోజుల్లోనే రుణమాఫీ చేస్తామన్నారు. ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చిన తాము రైతుల అవసరం కోసం పనిచేస్తామన్నారు. జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావ్ పాల్గొన్నారు


ఆంధ్రనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## గంటన్నర.. నరకయాతన

- లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన సెక్యూరిటీ గార్డు
- తీవ్రంగా శ్రమించి బయటికి తీసిన రెస్క్యూ టీమ్

వినాయక్‌నగర్, జనవరి 17: నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఉన్న లావణ్య ఆర్కేడ్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పనిచేసే సెక్యూరిటీ గార్డు లిఫ్టులో ఇరుక్కుపోయాడు. రెస్క్యూ టీం, అగ్నిమాపక శాఖ ప్రత్యేక టీం సహాయంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. లావణ్య ఆర్కేడ్ కాంప్లెక్స్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మహేందర్‌గౌడ్ అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుధవారం లిఫ్టులో పైఅంతస్తు నుంచి కిందికి వస్తుండగా గ్రౌండ్ ఫ్లోర్‌లో కాలు బయటపెట్టే సమయంలో లిఫ్ట్ కొంత పైకి వెళ్లి ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో అతడి కాళ్లు రెండు బయట ఉండగా.. మోకాలి పైభాగం మొత్తం లిఫ్టులో ఇరుక్కుపోయింది. మహేందర్ గౌడ్ కేకలు వేయగా.. చుట్టుపక్కల ఉన్నవారు గుమిగూడారు. హైదరాబాద్ ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు ఈ విషయం తెలియజేయగా.. జిల్లాకేంద్రంలోని ఫైర్ రెస్క్యూ బృందానికి వారు సమాచారం ఇచ్చారు. ఫైర్ రెస్క్యూ టీం ఘటనా స్థలానికి చేరుకొని.. సుమారు అరగంటపాటు శ్రమించి, లిఫ్ట్ ఒక భాగాన్ని యంత్రంతో కోసి సెక్యూరిటీ గార్డును బయటికి తీశారు. గంటపాటు ప్రాణ భయంతో లిఫ్ట్‌లో బిక్కుబిక్కుమంటూ ఉన్న మహేందర్ ప్రాణాలతో బయటపడడంతో అక్కడ ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు. ఫోర్త్ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేపడుతున్నారు.


లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన సెక్యూరిటీ గార్డును బయటికి తీస్తున్న రెస్క్యూ బృందం

## 'నవోదయ'లో ప్రవేశాలకు వేళాయె

- ఈనెల 20వ తేదీన అర్హత పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 5,252 దరఖాస్తులు
- మొత్తం 27 పరీక్షా కేంద్రాల ఏర్పాటు




నిజాంసాగర్, జనవరి 17: విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయం (2024-25)లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరో తరగతిలో కేవలం 80 సీట్లు ఉండగా 5252 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నారు.

ప్రవేశాల్లో గ్రామీణ విద్యార్థులకు అధిక ప్రాధాన్యమివ్వనున్నారు. మొత్తం సీట్లలో 75 శాతం గ్రామీణులు, 25 శాతం ఓపెన్ కోటా కింద కేటాయిస్తారు. ఈనెల 20న ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ప్రశ్నలన్నింటికీ అబ్జెక్టివ్ రూపంలో సమాధానాలు ఉంటాయి. రెండు గంటల వ్యవధిలో మూడు విభాగాల్లో 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

**ఉమ్మడి జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు**

కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ-3, దోమకొండ-2, కామారెడ్డి-4, బిచ్కుంద-3, ఎల్లారెడ్డి-2 మొత్తం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,689 మంది దరఖాస్తు చేసుకున్నారు.నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ -4, ఆర్మూర్-3, కమ్మర్‌పల్లి -1, భీమ్‌గల్ -2, బోధన్-3 మొత్తం 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,563 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి**

ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్షను కామారెడ్డి , నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, డీఈవోలు పర్యవేక్షించనున్నారు. ఇన్విజిలేటర్లు, సీఎల్‌వోలు, సీఎస్‌లతోపాటు ప్రతి గదిలో 24 మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు 45 నిమిషాల ముందే పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని అధికారులు సూచించారు.

**ఎగ్జామ్ సెంటర్‌కు 45 నిమిషాల ముందే చేరుకోవాలి**

"వెంట హాల్‌టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలి. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏమైనా ఇబ్బందులు ఉంటే నవోదయ పాఠశాలలో లేదా హెల్ప్‌లైన్ నంబర్ 73820 86533లో సంప్రదించాలి.విద్యార్థులు హాల్‌టికెట్, బాల్‌పెన్( బ్లూ లే దా బ్లాక్) తో పాటు పరీక్షా ప్యాడ్‌ను మాత్రమే తీసుకురావాలి.



-సత్యవతి, ప్రిన్సిపాల్ నిజాంసాగర్ నవోదయ

**గిరిజన గురుకులాల్లో ప్రవేశాల గడువు పొడిగింపు**

ఖలీల్‌వాడి, జనవరి 17 : గిరిజన సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాల గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త సంపత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రవేశపరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, బోనాఫైడ్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

## మహేశ్‌కుమార్‌కు ఎమ్మెల్సీ

**మాజీ మంత్రి షబ్బీర్‌కు షాక్..తీవ్ర అసంతృప్తిలో అనుచరులు**



నిజామాబాద్, జనవరి 17
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఇందూరు బిడ్డ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీ యోగం దక్కనున్నది. ఎమ్మెల్యేల కోటాలో నిర్వహించే ఎమ్మెల్సీ స్థానానికి ఆయన పేరును కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసింది. మరోవైపు మాజీ మంత్రి, పీసీసీ ముఖ్య నాయకుడు షబ్బీర్ అలీకి అధిష్టానం షాక్ ఇచ్చింది. ఎమ్మెల్సీ పదవిని ఆశించిన ఆయనను కాదని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీ రేసులో షబ్బీర్ అలీ, మహేశ్ కుమార్ గౌడ్‌లు తీవ్రంగా పోటీపడ్డారు. ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఏఐసీసీ స్థాయిలో పైరవీలు సైతం చేశారు. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ ఏర్పడిన రెండు స్థానాలకు ఈసీ ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయడంతో అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్ పార్టీకి అనివార్యమైంది. ఈ దశలోనే తొలుత అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ పేర్లు ఖరారు అయినట్లుగా గాంధీభవన్ వర్గాలు చెప్పాయి. అధికారిక ప్రకటన వెలువడే సమయానికి జాబితాలో బల్మూరి వెంకట్‌తోపాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ పేరును చేర్చారు. దీంతో మహేశ్ కుమార్ గౌడ్ వర్గీయుల్లో సంతోషం వెల్లివిరియగా షబ్బీర్ అనుచరుల్లో నైరాశ్యం కమ్ముకున్నది. ప్రత్యక్ష ఎన్నికల్లో ఓటమి పాలైన నేతలకు పార్టీ, ప్రభుత్వంలో ఎలాంటి పదవులు కట్టబెట్టడం ఉండబోదన్న సంకేతాలను ఏఐసీసీ ఇచ్చినట్లయ్యింది.

**ఏకైక బీసీ ప్రజాప్రతినిధి..**

బీసీలకు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తీరని అన్యాయం చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కటంటే ఒక్క టికెట్ కేటాయించలేకపోయింది. నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల జిల్లాల పరిధిలో రిజర్వ్డ్ స్థానాలు మినహాయిస్తే అగ్రకులాలకే కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసింది. సామాజిక న్యాయం పాటించకుండా ఇష్టానుసారంగా పార్టీ టికెట్లు కేటాయించడంపై అప్పట్లోనే కాంగ్రెస్ నాయకులు అధిష్టానం వైఖరిని తప్పుబట్టారు. బీసీలకు అన్యాయం చేయడం తగదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజామాబాద్ అర్బన్‌లో మైనార్టీ నేత షబ్బీర్‌ను మినహాయిస్తే బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాలలో అగ్రవర్ణాలకే అసెంబ్లీ టికెట్లను కేటాయించింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడలోనూ ఇదే తీరు కనిపించింది. ఎట్టకేలకు ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల్లో గౌడ సామాజికవర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ ఎంపిక చేసింది. ముఖ్యమంత్రికి సన్నిహితుడనే పేరుండడంతోనే ఈ పదవి వచ్చిందని కాంగ్రెస్ వర్గీయులు గుసగుసలాడుతున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తా

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పిట్లం, జనవరి 17: నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధికి కృషిచేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని కంబాపూర్‌లో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారెంటీలను అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, డీఎల్‌పీవో శ్రీనివాస్, సర్పంచ్ కవిత, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, వీరసంగప్ప, రమేశ్‌పటేల్, రాజుదేశాయి, నజీర్‌సేట్, ఇంరోజ్, బొడ్లరాజు తదితరులు పాల్గొన్నారు.


కంబాపూర్‌లో జీపీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు

వినాయక్‌నగర్, జనవరి 17 : మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన వ్యక్తికి పది రోజుల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ బుధవారం తీర్పు చెప్పారు. ఈ నెల 14వ తేదీన నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 23 కేసులు నమోదు కాగా.. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చారు. 22 కేసుల్లో రూ.26,500 ఫైన్ విధించిన మేజిస్ట్రేట్.. ఒక కేసులో నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన బాబు అనే వ్యక్తికి 10 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు.

## నందిపేట్ టు అయోధ్య



నందిపేట్ మండలం లక్కంపల్లి, శాపూర్ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది భక్తులు ద్విచక్ర వాహనాలపై బుధవారం అయోధ్య రామాలయానికి బయల్దేరి వెళ్లారు. బైక్ యాత్రను స్థానిక నాయకులు ప్రారంభించారు.

– నందిపేట్, జనవరి 17